
# ఏ మందు బెట్టిండ్రో

మినీకథ

డాక్టర్ పి. విజయపాల్‌రెడ్డి



పాపను భుజాన ఎత్తుకుని నవ్వుతూ నా గదిలోకి అడుగు పెట్టిన దంపతుల్ని చూశాను. ఆ యువకుణ్ణి ఎక్కడో చూసినట్లు గుర్తు. ఎంత ప్రయత్నించినా గుర్తుకు రావడం లేదు.

"కూర్చోండి. ఎవరికి చూడాలో చెప్పండి" అన్నాను నా సహజ ధోరణిలో. మా పాపకు నెలసూది యివ్వాలండీ అందా యువతి నెమ్మదిగా (గ్రామాల్లో ట్రిపులాంటిజన్ యింజక్షన్‌ను నెలసూది అని వ్యవహరిస్తారు).

సరేనని పరీక్షించి ప్రక్కగదిలోనికి పంపించాను యింజక్షన్ కోసం.

నవ్వుతూ నిలబడ్డాడా యువకుడు. "నన్ను గుర్తు పట్టలేదా సార్! సంవత్సరం క్రితం మా నాన్నగారితో మీ దగ్గరికొచ్చాము. అత్తగారు మందు పెట్టారని కక్కబోయించుకొని...మీవల్లనే మా సంసారం నిలబడ్డది సార్. మా చినమామ, నేనెళ్ళిపోతే ఆస్తంతా నాకే దక్కుతుందని లేనిపోనివి కల్పించి ఊరంతా ప్రచారం చేసిండు. మేము కూడా నమ్మినం సార్."

సంవత్సరం క్రితం విషయం ఒక్కసారి గుర్తుకొచ్చింది.

* * *

బెరుకు బెరుకుగా గదిలో ప్రవేశిస్తున్న యువకుణ్ణి చూస్తూ "రా బాబూ! కూర్చో" మన్నాను చేతితో కుర్చీ చూపిస్తూ. అతడి వెనకే లోపలికొచ్చిన పెద్ద మనిషిని సైతం కూర్చోమని ఎవరికీ చూడాల్సింది? అన్నాను టేబుల్ మీది స్టెతస్కోపు చేతిలోకి తీసుకుంటూ.

"వీడికేనండీ. నా కొడుకు సాసిరెడ్డి. సంవొమ్మిదో ఏడింకా నిండలేదు. కాళ్ళూ చేతులూ గుంజుతున్నాయని తలనొప్పిగా ఉంటోందని అంటున్నాడు. చూడండి ఈ వయస్సులో ముఖమంతా పాలిపోయి ఎలా ఉన్నాడో తమరు కాస్త పరీక్ష చేసి మంచి మందులిప్పించండి సార్" వినయంగా చెప్పుకుపోసాగాడు.

ఎగ్జామినేషన్ టేబిల్‌పై పడుకోబెట్టి టెంపరేచర్ చూశాను. ఆ పై బి.పి. హృదయస్పందన, లంగ్స్ పరీక్షించి చూద్దుమగదా "ఎ్రవి థింగ్ ఈజ్ నార్మల్" కేసేమిటో బోధ పడడం లేదు.

"ఎంతకాలం నుంచి నీరసంగా ఉంటున్నాడు?" నా ప్రశ్నకు గొంతు సవరించుకొని జవాబివ్వసాగాడు.

"తమరిదగ్గర దాపరికమెందుకు గాని నాకు ముగ్గురు కొడుకులు. వీడే అందరిలో చిన్న. మా మేన బావమరదికి ఒక్కతే బిడ్డ.. కొడుకుల్లేరు. అయిదెకరాల పొలం. నిమ్మతోటా, నాల్గు దూలాల యిల్లూ...మంచి మోతుబరి లెండి. కొడుకుల్లేరని బాధపడుతుంటే రక్త సంబంధం గదా అని ఇల్లరికం పంపేను. ఏ ఘడియలో ఆ ఇంట్లో అడుగు బెట్టిండోగాని మామీద ధ్యాసే లేదు. ఎంతసేపూ అత్తా, మామా, పెండ్లాం, వాడూ అదే లోకం."

"ఆసక్తికరంగా ఉందని అడిగేను ఆపైన."

ఏముంది దొరా! కన్న కడుపు గదా! ఉండబట్టలేక చూద్దామని ఆ వూరికే వెళ్ళాము. ఊళ్ళోవాళ్ళ మాటలు వింటుంటే నా ప్రాణం తల్లడిల్లింది బాబూ.

'పిల్లగాన్కి ఏమందు బెట్టిండ్రో గని ఒక్క పూట గూడ యింట్లకెళ్ళి బయటికెళ్ళడు.' ఎవ్వరి నోట చూసినా యిదే మాట.

యింటికి తీసుకొచ్చి కక్కబోయిస్తే కోడి గుడ్డుల మందు బెట్టి తినిపించిండ్రని తెలిసింది. కక్కించినపుడు గుడ్డు కాంచి బయటపడ్డద్దొరా! ఆందోళనగా చెబుతున్నాడు.

నిర్లిప్తంగా వింటున్నాడా యువకుడు.

ఎనిమిది సంవత్సరాలుగా పల్లె ప్రజలతో సంబంధం ఉన్న నాణ్ణి గనుక సమస్య అట్టే అర్థమయింది నాకు. నచ్చని సంసారం పాడుచేయ్యాలనే అసూయాపరుల పాచికలే కారణమనిపించింది.

"నీ పేరు బాబూ నీ పేరు?"

"పెదరాజయ్య బాబూ!"

"రాజయ్యా! నీ కొడలు కెన్నేండ్లుంటయ్?"

"మేనరికమని చేసినం దొరా. పదహారెళ్ళి పదిహేడు బడ్డయి."

చూడు రాజయ్యా! "నీ కొడుకూ కోడలూ యుక్త వయస్కులు. ఆ వయస్సులో వారి ఆనందం తప్ప వారికింకే ఆలోచనా రాదు. మనం మాత్రం వయస్సులో అలా లేమా? ఇప్పటి వయస్సూ, కుటుంబ పరిస్థితులూ అలా ఆలోచింపనీయవు గానీ, కలిగిన సంసారమంటున్నావ్. పడనివాళ్ళెవరో వీళ్ళ సంసారంలో కలతలు రేపడానికి సృష్టించిందే ఈ కథ అనిపిస్తున్నది. లేకపోతే మందు బెట్టడమేంటి. అది కక్కబోయిస్తే పడడమేంటి."

"లేద్దొరా. నా కండ్లతో చూసిన గదా కోడుగుడ్డు ముక్కలు తిన్నవి తిన్నట్టే పడ్డయి దొరా!"

"సరే! ఎలా కక్కించాడో తెలుపగలవా?"

"అయ్యా గిలాసెడు మేకపాలూ, ఏదో పసరూ తాగించి కాసేపు అటూ యిటూ నడవమన్నడండి. పిల్లగాడు నయిక్కుమని కక్కితే ముద్దలు ముద్దలు పడ్డదండీ. కట్టెపుల్లతో ఆ ముద్దలు కదిపిచూపించాడండీ."

"రాజయ్యా! తమ పబ్బం గడుపుకోవడానికి ఊళ్ళల్లో నాటు వైద్యులు చేసే మోసమే ఈ మందూ. ఈ కక్కబోయించడం...నీకు యింకా లోతుగా వివరించలేనుగానీ, ఆ పాలూ పసరూ నువ్వూ, నేనూ తాగినా అలాగే పడతాయి."

"అయితే యిది అబద్దమంటారా దొరా?"

"రాజయ్యా! నామాట విను. నచ్చని సంసారం పాడగానీయకు. ఓర్వలేక ఎవరో కల్పించిన కథ యిది. యిలాగే మీకు ఒకరిపై ఒకరికి అనుమానాలు పెరిగి పిల్లవాండ్ల జీవితాలు పాడైపోతాయి. ఇప్పటికైనా మీ బావమరది వద్దకు బాబును తీసుకువెళ్ళి జరిగిందంతా మరచిపోయి కలసిపోండి."

"ఇపుడెట్లా దొరా వచ్చే శుక్రవారం విడాకుల పంచాయితీ పెట్టిండ్రు. మందు బెట్టినింట్ల నుల్లెట్ల దింటడని జగడం ముదిరి ముదిరి యిదువు కాయితాని కొచ్చింది."

"చూశావా యిప్పటికయినా పట్టింపులకు పోకుండా సంసారం నిలబెట్టండి." నామాట మీద నమ్మకం కలిగినట్టే ఉంది. తండ్రీ కొడుకులిద్దరూ నెమ్మదిగా బయటికి వెళ్ళారు.

ఇలా ఇరుగు పొరుగుల ఈర్ష్యా ద్వేషాలకు, అజ్ఞానపు టాలోచనలకూ ఎన్ని కుటుంబాలు బలైపోతున్నాయో గదా అనుకుంటూ తర్వాతి పేషెంటును చూడసాగాను. *